క్లుప్తంగా

కూలిన గోడ పరిశీలన



కూలిన గోడను పరిశీలించి అధికారులకు సూచనలిస్తున్న కార్పొరేటర్ వెంకటరమణ

మద్రిపాలెం: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జీవీఎంసీ 51వ వార్డు అప్పయ్యనగర్‌లోని మురుగన్ గార్డెన్స్ అపార్ట్‌మెంట్ పక్కన ఉన్న గోడ కూలిపోయింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సోమవారం కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ కూలిన గోడను పరిశీలించారు. సచివాలయం వీఆర్వో, సిబ్బందితో సహా ఆయన పరిశీలించి వారికి తగు సూచనలిచ్చారు. త్వరితగతిన గోడ పునర్నిర్మాణ పనులు పూర్తిచేయాలని ఆదేశించారు.

విన్నపాలు వినవలె..



సమస్యలు తెలుసుకుంటున్న జెడ్సీ బొడ్డేపల్లి రాము

కంచరపాలెం: జీవీఎంసీ జోన్–5 జ్ఞానాపురం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలు సమస్యలపై 5 వినతులు అందాయి. జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము నేరుగా వినతులు స్వీకరించారు. ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 02, యూజీడీ విభాగానికి 02, రెవెన్యూ విభాగానికి 01 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ రాము తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఈఈలు తారా ప్రసన్నరెడ్డి, పద్మావతి, డీఈ భరణికుమార్, విద్యుత్ ఏఈ అర్చన, వాటర్ ఏఈ సుమన్, ఏపీడీవో కృపానందం, పి.పుణ్యవతి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో 10.6 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన తనిఖీల్లో అక్రమంగా రవాణా చేస్తున్న 10.6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఎస్.రామారావు, ఆర్పీఎఫ్ ఎస్‌ఐ వి.కీర్తిరెడ్డి సోమవారం రైల్వే స్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు చేశారు. బిహార్ రాష్ట్రం కైమూర్ జిల్లాకు చెందిన నిరంజన్ బిన్, మధ్యప్రదేశ్ కట్ని జిల్లాకు చెందిన హరీష్ తివారి విశాఖ రైల్వే స్టేషన్ మీదుగా బెంగళూరుకు గంజాయిని అక్రమంగా రవాణా చేయడం గుర్తించి వీరిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.53 వేల విలువైన 10.6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు జీఆర్పీ ఎస్‌ఐ రామారావు తెలిపారు.

కొత్త కార్యాలయానికి శంకుస్థాపన



వైశాఖి స్పోర్ట్స్ పార్క్ కళా వేదిక సమీపంలో భూమిపూజ చేస్తున్న మహిళలు

మురళీనగర్: స్థానిక వైశాఖి స్పోర్ట్స్ పార్కులో నూతన కార్యాలయ భవనం నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం వైశాఖి భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో కార్యాలయం నిర్వహిస్తున్నారు. ఇది ఇరుగ్గా ఉండటంతో నూతన భవనాన్ని నిర్మించాలని కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు పార్కులోని కళా వేదిక సమీపంలో దీని నిర్మాణానికి పార్కు అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్ ఆధ్వర్యంలో సభ్యులు కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పార్కు కార్యదర్శి పీవీఎస్ రాజు, కోశాధికారి రామకృష్ణ, రొంగలి జగన్నాథం, మరళీధర్, టీఎస్‌ఎన్ రాజు, నాగేశ్వరరావు, నాగరాజు, దేముడు, సుధాకర్, గోవిందరెడ్డి, వర్మ, విశ్వనాథరాజు, రత్నం, సుబ్బారావు, ఆర్ఎల్‌కే రాజు, ప్రసాద్, ప్రసాదరావు, వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

వానొస్తే.. నరకం

- వర్షాల ప్రభావంతో పొంగి ప్రవహిస్తున్న గెడ్డలు, డ్రైనేజీలు
- రహదారులపైకి చేరుతున్న వ్యర్థాలు, మురుగు
- 42, 45 వార్డుల ప్రజల ఆందోళన



తాటిచెట్లపాలెం హైవే బస్టాప్ వెనుక కోతకు గురైన సర్వీస్ రోడ్డు



పూర్ణ వైన్స్ ఎదురుగా డ్రైనేజీలో గ్లాసులు, పూడిక

తాటిచెట్లపాలెం: తాజాగా కురుస్తున్న **వర్షాల** ప్రభావంతో గెడ్డలు, డ్రైనేజీలు పొంగి ప్రవహిస్తున్నాయి. రోడ్లన్నీ వ్యర్థాలు, వర్షపు నీటితో జలమయమవుతున్నాయి. ఒక పక్క గెడ్డలు పొంగుతుంటే.. మరో పక్క గెడ్డలు పూర్తిగా పూడికలతో నిండిపోయి ప్రమాదకరంగా మారాయి. గెడ్డలు, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో వర్షపు నీరు రోడ్ల మీదుగా ప్రవహిస్తోంది. దీంతో సర్వీస్ రోడ్లు కోతకు గురవుతున్నాయి. వానొస్తే గెడ్డల పరిస్థితి ఘోరంగా ఉంటోందని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పూడికలమయం.. ప్రమాదకరం

జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం దరి వాసుదేవనగర్ గెడ్డలో పూడికలు నిండిపోయాయి. ఇక్కడ మట్టి, చెత్త వచ్చి చేరడంతో గెడ్డ ఇటు నుంచి అటు వైపు వెళ్లే దారి ఇరుకై పోయింది. దీంతో ఇక్కడ రోడ్డుపై నీరు ప్రవహిస్తోంది. తాటిచెట్లపాలెం జంక్షన్ వద్ద గల పూర్ణ వైన్స్ పరిసర ప్రాంతాల్లోని డ్రైనేజీలోనే ప్లాస్టిక్ గ్లాసులు, వ్యర్థాలు పారేయడంతో డ్రైనేజీలు కూడా నిండిపోయి ప్రమాదకరంగా మారాయి. శనివారం నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ఈ ప్రాంతంలో రోడ్డు పక్కన కుంగిపోయింది. తాటిచెట్లపాలెం జాతీయ రహదారి పక్కనే గల డ్రైనేజీ రక్షణ గోడ, దాని అంచున సుమారు రెండడుగుల మేర రోడ్డు కుచించుకుపోయింది. ఏ మాత్రం ఆదమరచినా.. డ్రైనేజీలోకి జారి పడాల్సిందే. దీనిలో ప్రవహించాల్సిన వర్షపు నీరు రోడ్డుపైకి చేరుతోంది.

దారుణంగా రైల్వే న్యూకాలనీ గెడ్డ

జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీలోని ప్రధాన గెడ్డ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. రైల్వే న్యూకాలనీ బ్రహ్మకుమారీస్ కార్యాలయం పక్కన గల గెడ్డలో పైవరకు చెత్తాచెదారం, వ్యర్థాలతో నిండిపోయి ఉంది. ఈ గెడ్డలో వర్షపు నీరు ప్రవహించేందుకు ఏ మాత్రం అవకాశం లేకుండా అన్ని మార్గాల్లోను పూర్తిగా వ్యర్థాలతో మూతపడ్డాయి. ఈ గెడ్డలో నుంచి నీరు రోడ్డుపైకి చేరి ప్రవహిస్తోంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా.. పెద్ద ప్రమాదాలే జరుగుతాయని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



వ్యర్థాలతో నిండిన రైల్వే న్యూకాలనీ గెడ్డ



రైల్వే న్యూకాలనీ బ్రహ్మకుమారీస్ కార్యాలయం ముందు రోడ్డుపైకి చేరిన చెత్త



శిథిలమైన రక్షణ గోడలతో ప్రమాదకరంగా తాటిచెట్లపాలెం గెడ్డ

వీరికి లేదా సెలవు..!

- యథావిధిగా తెరుచుకున్న అంగన్‌వాడీ కేంద్రాలు

మద్రిపాలెం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఆదివారం ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో ఇప్పటికే అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో అప్రమత్తమైన అధికారులు సోమవారం పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు. అయితే అర్బన్ ఐసీడీఎస్ అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రం సెలవు ప్రకటించకపోవడంతో యథావిధిగా అవి తెరుచుకున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ సెంటర్లకు పంపించారు. ఇదిలా ఉండగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు సెలవు ప్రకటించిన అధికారులు అంగన్‌వాడీ ప్రీ స్కూళ్లకు ఎందుకు సెలవు ప్రకటించలేదని, వీరికి సెలవు వర్తించదా అని ప్రశ్నిస్తున్నారు. పిల్లలకు ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దుర్గాగణపతి నవరాత్రి ఉత్సవాలకు పందిరి రాట





దుర్గాగణపతి ఆలయం వద్ద ముహూర్తపు రాట వేస్తున్న కార్పొరేటర్ గోవింద్

సీతంపేట: సీతంపేట కూడలిలోని దుర్గాగణపతి ఆలయంలో ప్రతి ఏటా మాదిరిగా ఈ ఏడాది కూడా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి శ్రీకారం చుట్టారు. ఆలయ ఆవరణలో సోమ వారం చవితి ఉత్సవాలకు పందిరి రాట కార్యక్రమం నిర్వహించారు. ఈవో జి.వి.రమాభాయి ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు నటరాజన్ మంత్రోచ్చారణల మధ్య 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, జగదీశ్వరి దంపతులు ముత్తయిదువుల తో కలిసి రాట వేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఈ నెల 27న వినాయక చవితి పర్వ దినాన దుర్గాగణపతి వెండి కవచంలో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ గణపతికి పంచామృతాభిషేకాలు, అర్చనలు, హోమాలు, ప్రత్యేక అలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. రోజుకొక అలంకారంలో ప్రతి రోజూ సాయంత్రం దుర్గాగణపతి భక్తులకు దర్శనమిస్తారన్నారు.

వినాయక చవితి వేడుకలకు ఏర్పాట్లు



మాధవధారలో పందిరి రాట వేస్తున్న స్థానికులు

మురళీనగర్: మాధవధారలో శ్రీ కుంచుమాంబ యూత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా సోమవారం పందిరి రాట వేశారు. కుంచుమాంబ అమ్మవారి ఆలయ ఆవరణలో 42వ వినాయక చవితి వార్షికోత్సవ ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు. స్థానికుల ఆధ్వర్యంలో రాట వేసి పూజలు చేశారు. వీరు 41 ఏళ్లుగా వినాయక ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. పర్యావరణ హితమైన మట్టి గణపతిని ఏర్పాటు చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పి.వరహా నరసింహం, ఎస్.అశోక్, పి.రమేష్, గోవింద, అజయ్, నాగన్న, స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ కల్చరల్ కార్నివాల్



వాల్తేర్ డిస్ట్రిక్ట్ అసోసియేషన్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సభ్యులతో డీఆర్ఎం లలిత్ బోహ్రా, అధికారులు, ఈకార్వో ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేర్ డిస్ట్రిక్ట్ అసోసియేషన్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సోమవారం నిర్వహించిన సావన్ ఆయోరే–కల్చరల్ కార్నివాల్ ఘనంగా జరిగింది. ఫైనల్స్ ప్రదర్శనలను ముఖ్య అతిథి డీఆర్ఎం, వాల్తేర్ డిస్ట్రిక్ట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లలిత్ బోహ్రా తిలకించారు. అనంతరం విన్నర్స్, రన్నర్స్‌కు ఆయన చేతుల మీదుగా అవార్డులు, ప్రశంసాపత్రాలు అందజేసారు. కల్చరల్ అసోసియేషన్ సభ్యులు మొత్తం 11 గ్రూప్ ప్రదర్శనలు, 26 సోలో ప్రదర్శనలు, 2 ఫోక్ ప్రదర్శనలు, 2 మోనో ప్రదర్శనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఈకార్వో ప్రెసిడెంట్, వాల్తేర్ డిస్ట్రిక్ట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ జ్యోత్స్న బోహ్రా, ఏడీఆర్ఎం మనోజ్ కుమార్ సాహూ, ఈకార్వో వైస్ ప్రెసిడెంట్ మధుస్మిత సాహూ, డిస్ట్రిక్ట్ కమిషనర్(గైడ్స్) డాక్టర్ డి.భాషిని ప్రియాంక, సీనియర్ డీఈఎన్ డి.జె.రావు, ఏడీసీ(గైడ్స్) వి.భవ్య, నేషనల్ అడ్వంజర్ ఆఫీసర్ బిల్కిస్ బానో తదితరులు పాల్గొన్నారు.

డేటా విశ్లేషణలో క్వాంటమ్ టెక్నాలజీ కీలకం



ప్రసంగిస్తున్న కృష్ణా విశ్వవిద్యాలయం వీసీ రాంజీ

మురళీనగర్: అభివృద్ధి చెందుతున్న సాంకేతిక ప్రపంచంలో డేటా విశ్లేషణకు సంబంధించి క్వాంటమ్ టెక్నాలజీ కీలకం కానుందని కృష్ణా విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ కె.రాంజీ అన్నారు. ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా ఏఐసీటీఈ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ అధ్యాపకులకు 'న్యూమరికల్ అప్రోచ్ ఇన్ డిజైన్ థింకింగ్' అనే అంశంపై కంచరపాలెం పాలిటెక్నిక్ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నకుమార్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఆరు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించి ప్రసంగించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను బోధనాభ్యసనలో వినియోగించాలని సూచించారు. ఫైనైట్ ఎలిమెంట్, ఫైనైట్ డిఫరెన్స్, ఫైనైట్ వాల్యూమ్ పద్ధతులను భవిష్యత్తులో ఏఐ వంటి టెక్నాలజీలో వినియోగిస్తారన్నారు. గౌరవ అతిథి, రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ ఎం.ఎ.వి.రామకృష్ణ మాట్లాడుతూ డిప్లొమా స్థాయిలోనే హ్యూమన్ ఫ్రెండ్లీ డిజిటల్ టెక్నాలజీని పాఠ్యాంశంగా చేర్చాల్సి ఉందన్నారు. దీని వల్ల విద్యార్థులు భవిష్యత్తులో ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, రోబోటిక్స్ వంటి రంగాల్లో మెరుగైన అవకాశాలను పొందుతారన్నారు. ప్రత్యేక అతిథి శ్రీకాకుళం పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు మాట్లాడుతూ అధ్యాపకులు, విద్యార్థుల కెరీర్‌కు డిజైన్ థింకింగ్ ఉపయోగపడుతుందని చెప్పారు. ఎస్ఎస్‌టీఎల్ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ పి.వి.ఎస్.గణేష్‌కుమార్ డిజైన్ థింకింగ్ ప్రాముఖ్యతను వివరించారు. శిక్షణకు వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కాలేజీల ఫ్యాకల్టీలు, ఇంజినీరింగ్ కళాశాలల అధ్యాపకులు, పరిశోధకులు హాజరయ్యారు. కార్యక్రమంలో గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, ఆముదాలవలస, పెందుర్తి, అనకాపల్లి పాలిటెక్నిక్ కాలేజీల ప్రిన్సిపాళ్లు డాక్టర్ కె.జానకీరాం, డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, ఐ.వి.ఎస్.ఎస్.శ్రీనివాసరావు, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్.రాజు, కో–కో ఆర్డినేటర్ ఎం.భరణి పాల్గొన్నారు.

నూతన ధ్వజ స్తంభం ఏర్పాటు



రామలింగేశ్వరాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ధ్వజ స్తంభం



స్తంభం పీఠం వద్ద శివపార్వతుల చిత్రం

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు రామకృష్ణానగర్‌లోని దేవదాయ శాఖ పరిధి రామలింగేశ్వరాలయంలో నూతన ధ్వజ స్తంభం ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంలో 1971లో ప్రతిష్ఠించిన ధ్వజ స్తంభం సుమారు 54 ఏళ్ల పాటు భక్తుల పూజలు అందుకుంది. దీని వయసు మళ్లినందున కొత్త స్తంభం ఏర్పాటు చేయాలని ఆలయ పురోహితులు సూచించారు. దీంతో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక పెద్దలు ఈవో రమాభాయికి, ఎమ్మెల్యే పి.వి.ష్ణుకుమార్ రాజు దృష్టికి తీసుకెళ్లగా డోనార్ స్కీం కింద ధ్వజ స్తంభం ఏర్పాటుకు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు అనుమతిచ్చారు. దాతల సహకారంతో నూతన ధ్వజ స్తంభం ప్రతిష్ఠ చేసి, దానికి 250 కిలోల ఇత్తడితో తాపడం చేశారు. నూతన ధ్వజ స్తంభం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. స్తంభం పీఠం వద్ద నాలుగు వైపులా శివపార్వతి, త్రిశూలం, గణేషుడు, సుబ్రహ్మణ్యస్వామి చిత్రాలను తీర్చిదిద్దారు.

కుండపోత వాన



అక్కయ్యపాలెం హైవే వద్ద తెగిన విద్యుత్ వైర్లను పునరుద్ధరిస్తున్న సిబ్బంది, కూలిన చెట్టును తొలగిస్తున్న సిబ్బంది



ద్వారకానగర్ బీవీకే కళాశాల వద్ద చెరువును తలపిస్తున్న రహదారి

- ప్రధాన రహదారులు జలమయం
- ఇబ్బందులు పడిన జనం

సీతంపేట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో సోమవారం వర్షం కుమ్మేసింది. శనివారం రాత్రి ప్రారంభమైన వర్షం, ఆదివారం ఎడతెరపి లేకుండా కురిసింది. సోమవారం కూడా అదే రీతిలో కుండపోతగా వాన కురవడంతో రహదారులు జలమయమయ్యాయి. రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులకు గురయ్యారు. గెడ్డలు, డెయిన్లు పొంగి ప్రవహించాయి. బుల్లయ్య కళాశాల వద్ద, ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రి, ద్వారకానగర్ బీవీకే కళాశాల ఎదుట, శంకరమఠం రోడ్‌లో వాన నీరు పెద్ద ఎత్తున నిలిచిపోయింది. జనజీవనం చాలా వరకు స్తంభించింది. వర్షం తీవ్రతతో పాఠశాలలకు ముందస్తుగా సెలవు ప్రకటించారు. ఉద్యోగులు, కార్మికులు తమ విధులకు బస్సు, కార్లు, ఆటోల్లో ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. రోడ్డు పక్కన వ్యాపారాలు చేసే వారు బేరాలు లేక ఉసూరుమన్నారు. అక్కయ్యపాలెం హైవే పక్కన సర్వీస్ రోడ్‌లో సత్యసాయి మందిరం వద్ద భారీ చెట్టు కూలిపోయింది. రోడ్డుకు అడ్డుగా, ఒకరి ఇంటిపైన, విద్యుత్ తీగలపైన చెట్ల కొమ్మలు పడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. 26వ వార్డు కార్పొరేటర్ సమాచారమివ్వడంతో హార్టికల్చర్, విద్యుత్ శాఖ సిబ్బంది వచ్చి చెట్టు కొమ్మలు తొలగించి, విద్యుత్‌ను పునరుద్ధరించారు.

నిలిచిన నీరు.. పేరుకుపోయిన చెత్త

మురళీనగర్: ఎడతెరిపి లేకుండా మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు విరామం ఏర్పడటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల తరువాత వర్షం ఆగింది. దీంతో జనం రోడ్డుపైకి చేరుకుని తమ దైనందిన వ్యవహారాల్లో నిమగ్నమయ్యారు. భారీ వర్షాల నేపథ్యంలో సోమవారం స్కూళ్లకు సెలవు ప్రకటించడంతో మురళీనగర్ పరిసరాల్లోని మాధవధార జీవీఎంసీ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, ఏఎస్సార్ నగర్‌లోని కె.కాలనీ హైస్కూల్, బర్మా కాలనీ ప్రాథమిక పాఠశాలలు, ప్రైవేటు స్కూళ్లు తెరుచుకోలేదు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్, కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్)లకు సెలవు ఇవ్వలేదు. దీంతో తరగతులు యథావిధిగా జరిగాయి.

ఇబ్బందులు పడుతున్న జనం

వర్షాలకు చాలా చోట్ల పేరుకుపోయిన చెత్తను తొలగించలేదు. పట్టాభిరెడ్డితోటలోని రహదారి పక్కన చెత్తతో నిండిపోయిన కంటైనర్‌ను ఖాళీ చేయకపోవడం వల్ల దుర్వాసన వెదజల్లుతోంది. మురళీనగర్ సెక్టార్–8లోని అపార్ట్‌మెంట్‌లను ఆనుకుని పొదలు, మొక్కలు తొలగించకపోవడం వల్ల నివాసులకు విషపురుగుల నుంచి ప్రమాదం పొంచి ఉంది. పార్కు పరిసరాల్లోని ప్రాంతం కొండను ఆనుకుని ఉండటంతో విష సర్పాలు సంచరిస్తుంటాయి. ఇవి గడ్డి, పొదల్లో పొంచి ఉన్న సంఘటనలు ఎన్నో జరిగాయి. జాతీయ రహదారిని ఆనుకుని సర్వీస్ రోడ్డులో వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. జీవీఎంసీ పారిశుధ్య అధికారులు తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



పట్టాభిరెడ్డితోటలో పేరుకుపోయిన చెత్త



ప్రాంతీయ కంటి ఆస్పత్రి వద్ద నిలిచిన వర్షపు నీటిలో ప్రయాణిస్తున్న వాహనాలు



రహదారిపై నిలిచిన వర్షపు నీటిలో చిరు వ్యాపారి అవస్థలు



హైవేలో మురళీనగర్ సర్వీస్ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాత మాధవరావుకు బాండ్ అందజేస్తున్న సూర్యనారాయణ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి సోమవారం నగరంలోని సీతమ్మధార ప్రాంతానికి చెందిన నరళీపురం మాధవరావు లక్షా 116 రూపాయలు విరాళం అందజేశారు. సంబంధిత మొత్తాన్ని సింహగిరిపై పీఆర్వో కార్యాలయంలో నగదు రూపంలో అందజేశారు. దేవస్థానం తరపున దాతకు బాండ్‌ను ప్రోటోకాల్ సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ అందించారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం ఆలయ అధికారులు అందజేశారు.

అప్పన్నకు వైభవంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి కి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి వారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.